
quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487


# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక




EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 320 | గురువారం 15 ఆగస్టు 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

## వినేశ్ ఫోగాట్‌కు
# నిరాశ
### అప్పీల్‌ను తిరస్కరించిన కాస్



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** భారత రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్ లో నిరాశ ఎదురైంది. పారిస్ ఒలింపిక్స్‌లో తనపై అనర్హతను సవాలు చేస్తూ వినేశ్ చేసిన అప్పీల్‌ను కాస్ కొట్టివేసింది. ఫైనల్‌కు చేరిన తర్వాత అనర్హత వేటు వేయడంతో తనకు రజతం ఇవ్వాలని వినేశ్ అప్పీల్‌లో కోరింది. దీనిపై విచారణ చేపట్టిన కాస్ అడ్‌హక్ డివిజన్ బుధవారం తీర్పు వెల్లడించింది. ఫోగాట్ చేసిన అప్పీల్‌ను కాస్ తిరస్కరించిందని భారత ఒలింపిక్ సంఘం ప్రకటించింది. 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ , అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ విధించిన అనర్హతను సవాలు చేస్తూ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ చేసిన అప్పీల్‌ను కాస్ తిరస్కరించడం దిగ్భ్రాంతికి, నిరాశకు గురిచేసింది. రజత పతకం ఇవ్వాలని వినేశ్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చుతూ కాస్ ఆగస్టు 14న తీర్పును ఇచ్చిందని భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అదనంగా బరువు ఉందని వినేశ్‌పై అనర్హత వేటు వేసింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేయడంతోపాటు 50 కిలోల ÷నైల్లో ఓడిన లోపెజ్ (క్యూబా)తో కలిసి తనకు రజత పతకం ఇవ్వాలని వినేశ్ అప్పీలు చేసిన విషయం తెలిసిందే.



## పదేండ్లలో ట్రిలియన్ డాలర్ల
# తెలంగాణే లక్ష్యం

### ప్రపంచంతోనే పోటీ పడతాం.. పక్క రాష్ట్రాలతో కాదు
### కాగ్నిజెంట్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి
### ఒప్పందాల పర్యవేక్షణకు ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు

**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్) :** అంతర్జాతీయ, జాతీయ స్థాయి కంపెనీలతో చేసుకునే ఒప్పందాలు ఎప్పటికప్పుడే కార్యరూపం దాల్చేలా కొత్తగా తెలంగాణ ఇన్వెస్టర్స్ టాస్క్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. టెక్నాలజీ, స్కిల్స్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ తదితర రంగాల్లో అపారమైన అవకాశాలున్న తెలంగాణలో పెట్టుబడుల భద్రతకు ప్రభుత్వమే భరోసా ఇస్తుందని చెప్పారు. రాబోయే పదేండ్లలో తెలంగాణను 1ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇందుకోసం 'తెలంగాణ ది ఫ్యూచర్ స్టేట్ ' నినాదంతో ప్రజాప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలను అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఆర్థికాభివృద్ధిలో తెలంగాణ ప్రపంచంతోనే పోటీపడుతుంది కానీ పక్క రాష్ట్రాలతో కాదని సీఎం అన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తర్వాత నాలుగో నగరమైన ఫ్యూచర్ సిటీని ప్రపంచ అవసరాలు తీర్చగలిగేలా 'చైనా ప్లస్ వన్ కంట్రీ' స్థాయిలో ఉంటుందని చెప్పారు. దిగ్గజ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ కోకాపేటలో నూతనంగా ఏర్పాటుచేసిన క్యాంపస్ ను ముఖ్యమంత్రి మిగతా 2లో..

## స్వాతంత్ర్య సమరయోధుల
# త్యాగాలు మరువలేనివి

### ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
### పోరాట యోధుల కలలు సాకారం చేసుకోవాలి
### పీడకలను మిగిల్చిన దేశ విభజన
### స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** దేశం కోసం త్యాగాలు చేసిన వారికి సెల్యూట్ చేస్తున్నానని భారత రాష్ట్రపది ద్రౌపది ముర్ము అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పోరాటంలో పాల్గొన్న వారి కలలు సాకారం కావాలన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, బాబాసాహెబ్ మిగతా 2లో..

## కేజ్రీవాల్‌కు
# మళ్లీ షాక్
### మధ్యంతర బెయిల్ నిరాకరించిన సుప్రీం



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** అరవింద్ కేజీవ్రాల్‌కి సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. సీబీఐ అరెస్ట్ వ్యవహారంలో మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. తదుపరి విచారణను ఆగస్టు 23కి వాయిదా వేసింది. ఇదే సమయంలో సీబీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. అరవింద్ కేజీవ్రాల్ సీబీఐ తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో పాటు మిగతా 2లో..

## పల్లెలు, పట్టణాల్లో
# కంపు



### కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం కొరవడింది
### నిధులు విడుదల లేక నీరసించిన గ్రామాలు
### మాజీమంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు

**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసింది.. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది.. ప్రజా పాలన అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నాయి. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. ప్లలెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారింది. దోమల మందుకు కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయి. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన అంటే.. ?? అని కేటీఆర్ నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు మిగతా 2లో..

## ఎమ్మెల్సీల నియామకానికి
# లైన్ క్లియర్
### హైకోర్టు తీర్పుపై స్టే విధించిన సుప్రీం
### నియామకాన్ని అడ్డుకోలేమన్న సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** తెలంగాణలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియరైంది. ఇప్పటికే కోదండరాం, అమీర్ అలీఖాన్ లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని రాష్ట్ర కేబినెట్ గవర్నర్ కు సిఫార్స్ చేసింది. ఐతే కొత్త నియామకాలపై స్టే విధించాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీంతో గతంలో మిగతా 2లో..

## సుంకిశాల
# ఘటనపై చర్యలు
### ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు

**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** సుంకిశాల ఘటనపై తెలంగాణ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసింది. ఈ ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 అధికారులు సీజీఎం కిరణ్, జీఎం మరియరాజ్, డీజీఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి మిగతా 2లో..

## రూ.30వేల కోట్ల రైల్వే
# కాంట్రాక్ట్ వెనక్కి
### వందే భారత్ తయారీ సంస్థతో కాంట్రాక్ట్ రద్దు

**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** వందేభారత్ రైళ్లను తయారు చేసేందుకు నిర్ణయించిన రూ.30 వేల కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తూ భారతీయ రైల్వే సంచలన నిర్ణయం తీసుకుంది. సెమీ-హై-స్పీడ్ రైల్వే సర్వీస్ అయిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తయారీ, నిర్వహణ కోసం ఈ టెండర్‌ను పిలిచారు. ఇందుకోసం అల్‌స్టోమ్ ఇండియా 100 వందే భారత్ రైళ్ల టెండర్‌ను చేజిక్కించుకునేందుకు ముందుకు వచ్చింది. అయితే ఆ కాంట్రాక్ట్‌ని రద్దు చేసినట్టు ఆల్‌స్టోమ్ ఇండియా కూడా ధృవీకరించింది. భారతీయ రైల్వే ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ.. భవిష్యత్తులో ఎలాంటి అవసరం ఉన్నా తమని సంప్రదించవచ్చని తెలిపింది. వందే భారత్ రైళ్ల కోసం 2023 మే 30వ తేదీన తెరిచిన టెండర్లలో ఆల్‌స్టోమ్ కంపెనీ అత్యల్ప బిడ్డర్‌గా నిలిచింది. రైల్వే శాఖ టెండర్ కమిటీ, అల్‌స్టోమ్ ఇండియా ఒక్కో రైలు తయారీ రేటుపై ఒప్పందంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఆల్‌స్టోమ్ ఇండియా ఒక్కో రైలుకు మిగతా 2లో..

## ఖనిజ సంపదపై రాయల్టీ
# వాపస్ చేయాలి
### బకాయిలు తీసుకునే హక్కు రాష్ట్రాలకు ఉంది
### కేంద్రం 12 ఏళ్లలోపు బకాయిలు చెల్లించాలి
### సుప్రీం తీర్పుతో రాష్ట్రాలకు తిరిగి హక్కులు

**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** ఖనిజ భూములు, గనులపై రాయల్టీ వాపస్ విషయంలో రాష్ట్రాలకు భారీ విజయం దక్కింది. 2005 నుంచి రాయల్టీ బకాయిలను కేంద్రం నుంచి రాష్ట్రాలు కోరవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. రాయల్టీపై ఇటీవల సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఈ ఏడాది జులై 25 నుంచే అమలు చేయాలన్న కేంద్రం అభ్యర్థనను సీజేఐ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. కేంద్రం, గనుల కంపెనీలు ఇవ్వాల్సిన బకాయిలను రానున్న 12 ఏళ్లలో దశలవారీగా చెల్లించాలని స్పష్టం చేసింది. అలాగే.. వీటిపై ఎలాంటి పెనాల్టీలు విధించొద్దని రాష్ట్రాలను ఆదేశించింది. ఖనిజాలు, ఖనిజ నిక్షేపాలు గల భూములపై రాయల్టీ విధించే అధికారం మిగతా 2లో..


## పంద్రాగస్ట్ వేడుకలకు
# ఎర్రకోట సిద్ధం
### జాతీయ జెండా ఆవిష్కరించనున్న ప్రధాని మోడీ
### 6వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం
### ఢిల్లీ విమానాశ్రయంలో తనిఖీలు ముమ్మరం



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** 78వ స్వాతంత్య్ర వేడుకల నిర్వహణకు దిల్లీలోని ఎర్రకోట ముస్తాబయ్యింది. ఈ వేడుకలకు దాదాపు 6 వేల మంది ప్రత్యేక అతిథులకు ఆహ్వానం అందింది. ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ జెండా ఆవిష్కరించిన తర్వాత జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. వివిధ రంగాల్లో రాణించిన, ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందిన వారిలో కొందరిని కేంద్రం ప్రత్యేక అతిథులుగా ఈ కార్యక్రమానిక ఆహ్వానించింది. ఇటీవల పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత బృందాలకు కూడా ఆహ్వానం పంపింది. ఎర్రకోట వేదికగా గురువారం జరగనున్న 78వ స్వాతంత్ర్య వేడుకలకు దాదాపు 400 మంది పంచాయతీరాజ్ సంస్థల మహిళా ప్రతినిధులను ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించినట్లు సంబంధిత మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సుమారు 45 మంది 'లఖ్‌పతీ దీదీలు', 30 మంది 'డ్రోన్ దీదీల'ను కూడా ఆహ్వానించినట్లు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఇదిలావుంటే స్వాతంత్య్ర దినోత్సవం వేళ.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దేశ రాజధాని దిల్లీలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా విమానాశ్రయాల్లో తనిఖీలు తీవ్రమయ్యాయి. దీంతో దిల్లీ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశీయ విమానయాన సంస్థ ఇండిగో అడ్వైజరీ జారీచేసింది. 'స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విమానాశ్రయంలో భద్రతతో పాటు సంబంధిత తనిఖీలు ఎక్కువగా ఉంటాయి. ఎలాంటి అవాంతరాలు లేకుండా అవసరమైన భద్రతా తనిఖీలు పూర్తి చేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రయాణికులను కోరుతున్నాం' అని ఇండిగో మిగతా 2లో..

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక



EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 1 సంచిక : 320 | గురువారం 15 ఆగస్టు 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8




## ఒకే యాప్ ద్వారా పౌరసేవలు

### ఐటి అధికారులకు సీఎం చంద్రబాబు సూచన

**అమరావతి,ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** రాష్ట్రంలో పౌరసేవలన్నీ ఒకే యాప్‌లో అందించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ శాఖను ఆదేశించారు. పౌరులకు అవసరమైన వివిధ రకాల సేవలు ఒక యాప్ ద్వారా అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే టాటా సంస్థ ప్రత్యేక యాప్ రూపొందించి కొంత వరకూ మెరుగైన రీతిలో సేవలందిస్తోందని చెప్పారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ, ఆర్టీజీఎస్‌లపై సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రాన్ని స్టార్టప్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు వీలుగా సమగ్ర నివేదిక రూపొందించాలని సూచనలు చేశారు. ప్రస్తుతం ఐటీ కంపెనీలు ద్వితీయశ్రేణి నగరాలకు విస్తరించేందుకు ఆసక్తి మిగతా 2లో..

## సోలార్ పవర్‌కు ప్రాధాన్యం

### ఎన్టీపిసిలో ఏపి ప్రభుత్వం ఒప్పందం

### చంద్రబాబు సమక్షంలో ఎంఓయూ





**అమరావతి,ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** ఎన్టీపీసీ విద్యుత్ వ్యాపార్ నిగమ్ లిమిటెడ్ తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ కార్యాలయాలపై 300 మెగావాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై ఒప్పందం చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఎన్టీపీసీ- ఏపీ నెడ్ క్యాప్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలపై సోలార్ ప్యానెల్స్ అమర్చేందుకు వీలుగా సంస్థల మధ్య ఒప్పందం చేసుకున్నాయి. 2025 నాటికి ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్యానెల్స్ అమర్చాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. సౌర విద్యుత్ ఉత్పత్తి చేయటంతో పాటు పొల్యూషన్ తగ్గింపు దిశగా 25 ఏళ్ల పాటు ఈ ఒప్పందం విద్యుత్ వ్యయాన్ని తగ్గిస్తుంది అన్నారు. 300 మెగావాట్ల విద్యుత్ రూఫ్ టాప్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా ఏటా రూ. 118.27 కోట్ల మేర విద్యుత్ ఆదా అవుతుంది.. 25 ఏళ్లలో రూ.2957 కోట్ల మేర ఆదా కానుంది.. దీంతో పాటు ఏడాదికి 3.41 లక్షల మెట్రిక్ టన్నుల మేర పొల్యూషన్ తగ్గుతుంది అని చెప్పుకొచ్చారు. 25 ఏళ్లలో 85. 25 లక్షల మెట్రిక్ టన్నుల మేర పొల్యూషన్ తగ్గించగలం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పుకొచ్చారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువలేనివి

### ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

### పోరాట యోధుల కలలు సాకారం చేసుకోవాలి

### పీడకలను మిగిల్చిన దేశ విభజన

### స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్రపతి



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** దేశం కోసం త్యాగాలు చేసిన వారికి సెల్యూట్ చేస్తున్నానని భారత రాష్ట్రపది ద్రౌపది ముర్ము అన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. పోరాటంలో పాల్గొన్న వారి కలలు సాకారం కావాలన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, బాబాసాహెబ్ మిగతా 2లో..

## వల్లభనేని వంశీ కేసుపై విచారణ

### 20 వరకు చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు



**అమరావతి, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై ఈనెల 20 వరకు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశించింది. గన్నవరం తెదేపా కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది.కృష్ణా జిల్లా గన్నవరంలోని తెదేపా కార్యాలయంపై దాడి కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. పలువురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని 71వ నిందితుడిగా చేర్చి గన్నవరం కోర్టుకు రిమాండ్ రిపోర్టు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేస్తారనే ఊహాగానాలు సాగుతున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత వంశీ నియోజకవర్గానికే రాలేదు. గత నెల 7న విజయవాడలోని నివాసానికి వచ్చిన సమయంలో తెదేపా శ్రేణులు దాడులకు దిగాయి. పోలీసు, కేంద్రబలగాలు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దాయి. అప్పటి నుంచి వంశీ ఎక్కడున్నారనే సమాచారం లేదు.

## టీడీపీ నేత దారుణ హత్య



### కళ్లల్లో కారం చల్లి హతమార్చిన దుండగులు

**కర్నూలు, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** జిల్లాలో తెదేపా నేత దారుణహత్యకు గురయ్యారు. పత్తికొండ మండలం హోసూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. తెదేపా నేత వాకిటి శ్రీనివాసులు (45) బుధవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లగా దుండగులు ఆయన కళ్లలో కారం చల్లి దారుణంగా హతమార్చారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ జయన్న ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. తెదేపా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కూడా మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. హత్య ఘటనకు దారితీసిన పరిస్థితులను డీఎస్పీతో మాట్లాడారు. నిందితులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేకు శ్రీనివాసులు ప్రధాన అనుచరుడు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైకాపాకు చెందిన వారే హతమార్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీనివాసులు హత్య కేసును త్వరగా ఛేదిస్తామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ద్వారా కేసును కొలిక్కి తెస్తామన్నారు. శ్రీనివాసులుకు గ్రామంలో ఎవరితో ఎలాంటి గొడవలు లేవని చెప్పారు. హత్య జరిగిన ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో బీర్ సీసాలు గుర్తించినట్లు తెలిపారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించే కుట్ర

### శాంతిభద్రతలు విఫలం అయ్యాయనేలా హత్యలు

### హంతకులు ఎవరైనా వదిలి పెట్టబోం అన్న హోమంత్రి అనిత

### ఘటనా స్థలిని పరిశీలించిన ఎస్పీ బిందు మాధవ్



**అమరావతి, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యం అవుతుందని చూపించేందుకే రాజకీయ హత్యలకు పాల్పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. కర్నూలులో టీడీపీ నేత హత్య కేసులో నిందితులు ఎంతటి వారైన కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎస్పీతో రెండుసార్లు సమీక్షించానని.. అగంతకులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో నాలుగు రాజకీయ హత్యలు జరిగితే అందులో ముగ్గురు టీడీపీ నాయకులు ప్రాణాలు కోల్పోయరని ఆవేదన వ్యక్తం చేశారు.. పెద్దల సభకు మచ్చ తెచ్చే విధంగా మిగతా 2లో..

## శ్రీశైలం జలాశయ పరిసరాల్లో చేపలవేట నిషేధం

### ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

అమరావతి,ఆగస్ట్14(ఆర్ఎన్ఎ): శ్రీశైలం జలాశయ పరిసరాల్లో చేపల వేటపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. చేపల వేట నిషేధకాలం అమలు చేస్తున్నట్లు మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జులై, ఆగస్టులో చేపల సహజ సంతానోత్పత్తి సమయమని, ఈ సమయంలో శ్రీశైలం జలాశయం, బ్యాక్‌వాటర్స్‌లో చేపల వేట వద్దని ఆదేశించింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఆగిపోవటంతో మత్స్యకారులు మిగతా 2లో..

## అగ్రిగోల్డ్ భూములు కాజేసి అమ్మకాలా?

### అవినీతి బయటపడగానే కోసాధింపు అంటారా

### రాజకీయం చేసి లబ్ది పొందాలనుకోవడం సిగ్గుచేటు

### మాజీమంత్రి జోగి రమేశ్‌పై మండిపడ్డ మంత్రి పార్థసారథి

### కులం కార్డును ప్రయోగించడం దారుణమన్న అనూరాధ



**అమరావతి, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు అగ్రిగోల్డ్ వ్యవహారంలో అరెస్టవ్వడంలో ఎలాంటి రాజకీయ కక్ష సాధింపు లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైకాపా ప్రతి అంశాన్ని రాజకీయం చేసి లబ్ది పొందాలనుకోవడం సిగ్గుచేటని అన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వానికి కక్ష సాధించాలని ఉంటే వైకాపా నేతలు బయటికి వచ్చి ఈ విధంగా మాట్లాడతారా అని ప్రశ్నించారు. చట్టానికి ఓసీ, బీసీ అని ఉండదన్నారు. ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న తమ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అగ్రిగోల్డ్ ఫిర్యాదు మేరకే విచారించి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఆనాడు మంత్రిగా ఉన్న జోగి రమేశ్ అధికార దుర్వినియోగంతో చట్ట వ్యతిరేకంగా భూములు కొని విక్రయించారని మంత్రి పార్థసారథి మిగతా 2లో..

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

### కెప్టెన్ వీరమరణం... నలుగురు ఉగ్రవాదుల హతం



**శ్రీనగర్, ఆగస్ట్14 :** స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందు.. జమ్మూ కాశ్మీర్‌లోని దోడా జిల్లాలోని అస్సార్ ప్రాంతంలో ఉగ్రవాదులతో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ సమయంలో భారత సైన్యానికి చెందిన 48 నేషనల్ రైఫిల్స్‌కు చెందిన ఒక కెప్టెన్ వీరమరణం పొందాడు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక పౌరుడు కూడా గాయపడ్డాడు. మరో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారని సమాచారం. శివగఢ్-అస్సార్ బెల్ట్‌లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆ ప్రాంతంలో రక్తపు మరకలు ఉండడంతో కాల్పుల్లో ఓ ఉగ్రవాది గాయపడి ఉండొచ్చని తెలిపారు. ఈ ప్రాంతం నుంచి భద్రతా బలగాలు ఒక ఎం4 కార్బైన్, మూడు బ్యాగులను స్వాధీనం చేసుకున్నాయని వర్గాలు తెలిపాయి. ఉధంపూర్ జిల్లాలోని పట్నీతోప్ ప్రాంతానికి సమీపంలోని అకర్ అడవుల్లో ఉగ్రవాదులు దాక్కున్నట్లు భావిస్తున్నామని, ఈ ప్రాంతాల్లో భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారని ఆయన చెప్పారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది.. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఉన్న ఒక ఉన్నత స్థాయి సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహిస్తున్నారు. దోడా జిల్లాలోని అస్సార్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం భద్రతా బలగాలు, మిగతా 2లో..

## సామూహిక హత్యాచారం కేసులో భయానక విషయాలు

### తక్షణమే చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 :** పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తోంది. ఈ కేసుకు సంబంధించిన భయానక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సామూహిక అత్యాచారం జరిగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఈ ఘటనపై స్పందించారు. ఈ దారుణంతో యావత్ దేశం ఉలిక్కిపడిందని, వైద్యవర్గాలు, మహిళల్లో అభద్రతా వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. 'బాధిత కుటుంబానికి న్యాయం చేయడానికి బదులు నిందితుడిని కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఆసుపత్రి, స్థానిక యంత్రాంగంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మెడికల్ కాలేజ్ వంటి ప్రదేశాల్లోనే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

## స్వాతంత్ర్య సమరయోధుల
# త్యాగాలు మరువలేనివి

అంబేద్కర్, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్‌ను గుర్తు చేసుకున్నారు. స్వాత్రంత్య దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె దేశ ప్రజలకు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ దేశం స్వాతంత్యం÷-ర కోసం ప్రతి ఒక్క వర్గం పోరాటం చేసిందన్నారు. ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం గర్వకారణమని చెప్పారు. ఎందరెందరో సమరయోధుల పోరాట ఫలితంగా దేశానికి స్వాతంత్య్ర సిద్ధించిందని, భగత్ సింగ్, చంద్రశేఖర్, ఆజాద్, సుఖదేవ్ వంటి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలు నిరుపమానమని రాష్ట్రపతి ఈ సందర్భంగా కొనియాడారు. ఆగస్టు 14వ తేదీన దేశ విభజన నాటి పీడకలను స్మరించుకునే రోజు ఇదని, విభజన సమయంలో వేలాది మంది బలవంతంగా దేశం విడిచివెళ్లారని, అనేక మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా నాటి ట్రాజెడీని స్ఫురణకు తెచ్చుకుని, సమష్టిగా బాధిత కుటుంబాలకు బాసటగా నిలవాలని అన్నారు. రాజ్యాంగ విలువలతో భారత్ ముందుకు వెళుతోందని చెప్పారు. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలు మానవ జాతి చూసిన అతిపెద్ద ఎన్నికల కసరత్తు అని పేర్కొన్నారు. విజయవంతంగా ఎన్నికలను నిర్వహించడం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య శక్తులను బలోపేతం చేస్తుందన్నారు. ఎన్నికలు శక్తివంతమైన ప్రజాస్వామ్యాన్ని ప్రస్ఫుటం చేశాయని.. ఎన్నికలు సజావుగా నిర్వహించిన ఈసీకి అభినందనలు తెలిపారు. ఎండ వేడిని తట్టుకొని ఓటర్లకు సహకారం అందించిన అధికారులు, భద్రతా సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో త్రివర్ణాన్ని ఆవిష్కరించడం ఉత్కంఠభరితమైన అనుభూతిని కలిగిస్తోందన్నారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి దేశం సిద్ధమవుతున్నందుకు నేను సంతోషిస్తున్నానన్నారు. త్రివర్ణ రంగులజెండా ఎగురవేయడం ఎల్లప్పుడూ మన హృదయాలను పులకింపజేస్తుందన్నారు. దేశవ్యాప్త ఉద్యమంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో అన్ని వర్గాలు పాల్గొన్నాయన్నారు. గిరిజనుల్లో తిల్కా మాంఝీ, బిర్సా ముండా, లక్ష్మణ్ నాయక్ తదితరుల త్యాగాలకు ఇప్పుడు ప్రశంసలు దక్కుతున్నాయన్నారు. బిర్సా ముండా జన్మదినాన్ని దేశం జనజాతీయ గౌరవ్ దివస్‌గా జరుపుకుంటున్నామన్నారు. వచ్చే ఏడాది ఆయన 150వ జయంతి వేడుకలు జాతీయ పునరుజ్జీవనానికి ఆయన చేసిన కృషిని మరింత గౌరవించే అవకాశంగా ఉంటుందని పేర్కొన్నారు. దేశం విభజన భయాందోళనలను గుర్తుచేసుకునే రోజు ఆగస్టు 14న విభజన్ విభిషిక స్మృతి దివస్‌ను పాటిస్తున్నదని.. దేశ విభజనతో లక్షలాది మంది వలసల వెళ్లారని, లక్షలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. కేంద్రం సామాజిక న్యాయానికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇస్తుందని.. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొన్నారు.

## ఒకే యాప్ ద్వారా
# పౌరసేవలు

కనబరుస్తున్న దృష్ట్యా వాటిని రాష్ట్రానికి తెచ్చేలా ప్రయత్నాలు చేయాలన్నారు. విశాఖపట్నం ఐఐఎం, తిరుపతి ఐఐటి సహకారంతో దేశవ్యాప్తంగా ఉత్తమ విధానాలను అనుసరిస్తున్న స్టార్టప్‌లను గుర్తించి వాటిని రాష్ట్రానికి తీసుకువచ్చేలా ప్రయత్నించాలన్నారు. మరోవైపు ఇప్పటికే ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం.. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందని, రిలయన్స్ సంస్థ కూడా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీకి సంబంధించి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అన్ని సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఐటీ అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించే కుట్ర

కొందరు ఎమ్మెల్సీలు ప్రవర్తన ఉంటుందని విమర్శించారు. డ్రైవర్ ను డోర్ డెలివరీ చేసిన వాళ్లు, ఫ్యామిలీ గొడవలతో రచ్చ చేసుకునేవాళ్లు ప్రజాప్రతినిధులు అంటే జనానికి ఎటువంటి సంకేతాలు ఇస్తున్నామో చెప్పాలి.. అటువంటి వ్యక్తులను సభకు పంపించిన పార్టీ ఆలోచన చేసుకోవాలి అంటూ హితవు పలికారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూర్ గ్రామంలో దారుణ హత్య జరిగింది.. హోసూరు మాజీ సర్పంచ్ శ్రీనివాసులు హత్యకు గురయ్యారు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన శ్రీనివాసులను దుండగులు ముందే పథకం ప్రకారం కళ్ళలో కారం కొట్టి వేట కొడవళ్లతో అత్యంత దారుణంగా నరికి చంపారు. ఈ ఘటనతో హోసూర గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. మాజీ సర్పంచ్ పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే కే ఈ శ్యాంబాబుకి ప్రధాన అనుచరుడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హోసూరు గ్రామంలో టీడీపీకి మంచి మెజార్టీ రావడం తర్వాత ఈ హత్య జరగడంతో రాజకీయంగా మరే ఇతర కారణాలతో హత్య జరిగి ఉంటుందా? అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. హత్య జరిగిన స్థలాన్ని ఎస్పీ బిందు మాధవ్ పరిశీలించారు. క్లూస్ టీం, ఆధారాలనుసేకరించారు. డాగ్ స్క్వాడ్, హత్య జరిగిన ప్రదేశం నుండి హత్య అయిన వ్యక్తి ఇంటి దగ్గరికి వెళ్లితిరిగి హత్య ప్రదేశానికి డాగ్ స్క్వాడ్ చేరుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. నిందితులను పట్టుకుంటామని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాచర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. హత్య కేసులో ఇప్పటికే ఆధారాలు సేకరించామని బిందు మాధవ్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆయన.. స్థానిక పోలీసులు సహా గ్రామస్థులతో మాట్లాడారు. శ్రీనివాసులు తలపై వెనుక నుంచి గొడ్డలితో నరికినట్లు గుర్తించామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని .. నిందితుల కోసం వేట కొనసాగిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

## అగ్రిగోల్డ్ భూములు కాజేసి
# అమ్మకాలా?

ఆరోపించారు. జగన్ ప్రభుత్వం సమస్యను పరిష్కరించకుండా అగ్రిగోల్డ్ ఆస్తులు సొంతం చేసుకోవాలని ప్రయత్నించిందని దుయ్యబట్టారు. అగ్రిగోల్డ్ వ్యవహారానికి కులం, మతం, రాజకీయ రంగు పులమాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొదటి నుంచి రాజకీయ కక్షసాధింపు నిర్ణయాలు తీసుకోవద్దని చెప్తున్నారని తెలిపారు. పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లను ఆనాడు జగన్ కక్షపూరితంగా రద్దు చేయించారని మంత్రి మండిపడ్డారు. అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా చేజిక్కించుకుని రాజకీయ కక్ష్యలతోనే తన కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేశారంటూ మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లాడడం అవివేకానికి నిదర్శనమని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలోనే అతణ్ని అరెస్టు చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. కక్ష్య సాధింపు చర్యలు అనేవి ఎన్డీయే ప్రభుత్వంలో ఉండవని ఆయన తేల్చి చెప్పారు. అగ్రిగోల్డ్ భూమిని చట్ట వ్యతిరేకంగా కొనుగోలు చేసినందునే జోగి రాజీవ్ అరెస్టు జరిగిందని మంత్రి పార్థసారథి చెప్పారు. ఈడీ అటాచ్మెంట్‌లో ఉన్న భూములు కొనుగోలు చేయటం ఎంత వరకు సబబో జోగి రమేశ్ చెప్పాలని మంత్రి అన్నారు. సర్వే నంబర్లు ఎందుకు మార్పులు చేశారో ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టు చేశారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారని పార్థసారథి మండిపడ్డారు. ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసి తప్పును కప్పిపుచ్చుకోవాలని చూసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ఇదిలావుంటే గౌడ, బీసీ అని చెప్పుకునే కనీస అర్హత వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు లేదని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. అగ్రిగోల్డ్ భూముల అక్రమ కొనుగోలు వ్యవహారంలో తన కుమారుడు జోగి రాజీవ్ అరెస్టు కావడంతో జోగి రమేశ్ కుల ప్రస్తావనను తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తాను బలహీన వర్గానికి చెందిన వ్యక్తిని కాబట్టే తన కుటుంబంపై దాడులు చేసి అక్రమ అరెస్టు చేశారంటూ ఆయన మాట్లాడడం సబబు కాదని ఎమ్మెల్సీ అన్నారు. జోగి అక్రమాలు బయటపడడంతో కులం రంగు పులిమి విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో రాజీవ్ పూర్తి సాక్ష్యాధారాలతో సహా దొరికిపోయాడని ఎమ్మెల్సీ అనురాధ వెల్లడించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మీరు చేసిన దాడులు, అక్రమాలు ఎవ్వరూ మర్చిపోలేదంటూ ఆమె చెప్పుకొచ్చారు. అధికారమదంతో పెనమలూరులో పెన్షన్ డబ్బుల కోసం వృద్ధురాలిని ఎండలో నిలబెట్టి ఆమె ప్రాణాలు పోవడానికి కారణమయ్యావని జోగిపై మండిపడ్డారు. ఆ నెపాన్ని అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు మీదకి నెట్టాలని చూశావంటూ అతనిపై మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన అక్కను వదిలి పెట్టాలంటూ వేడుకున్న బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను అత్యంత కిరాతకంగా చంపినప్పుడు ఎందుకు నోరు మెదపలేదంటూ జోగి రమేశ్‌పై అనురాధ నిప్పులు చెరిగారు. మీరు చేసిన పాపాలు, అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలు అన్నింటికీ శిక్ష తప్పదని ఆమె హెచ్చరించారు. వైసీపీ అధికారంలో ఉండగా అడ్డగోలు వ్యవహారాలు చేసి ఇప్పుడు అవి సాక్ష్యాధారాలతో సహా బయటపడుతుంటే అక్రమ అరెస్టు చేశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ధ్వజమెత్తారు. మీ కుమారుడు అరెస్టుకు కులం రంగు పులిమి రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## చేపలవేట నిషేధం

పుట్టీలపై బయలుదేరి చేపలు వేటాడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం నిలిచిపోవటంతో సోమవారం ప్రాజెక్టు గేట్లన్నీ మూసివేశారు. దీంతో డ్యాం దిగువన ఉన్న ప్లంజ్‌పూల్‌లో చేపలను పట్టుకునేందుకు కృష్ణాతీరంలోని పాతాళగంగ, లింగాలగట్టు గ్రామాల్లోని మత్స్యకారులు పుట్టీలపై బయలుదేరారు. ప్రాజెక్టు నుంచి దూకుతున్న నీటికి ఎదురెళ్లే పెద్ద చేపలు డ్యాం దిగువన ప్లంజ్‌పూల్‌లోకి చేరతాయి. వీటి కోసమే మత్స్యకారులు వలలతో వేట సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మత్సశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ ప్రారంభం కావడం గమనార్హం. భారత సైన్యం ఈ ఆపరేషన్‌కు ఆపరేషన్ అస్సార్ అని పేరు పెట్టింది. మంగళవారం తెల్లవారుజామున, జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో వరుసగా నాలుగో రోజు కూడా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగాయి. మంగళవారం తెల్లవారుజామున అహ్లాన్ గగర్మండు అటవీప్రాంతంలో కొన్ని అనుమానాస్పద కార్యకలాపాలను సెర్చ్ పార్టీలు గమనించి, వారి ఆచూకీ కోసం కాల్పులు జరిపినట్లు అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతంలో దాక్కున్న ఉగ్రవాదులను ఏరివేసేందుకు అదనపు భద్రతా సిబ్బంది సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. కాశ్మీర్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వీకే బిర్ది విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో యాంటీ టెర్రరిస్ట్ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఆగస్ట్ 10న అనంత్‌నాగ్‌లో ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు వీరమరణం పొందగా, కోకెర్‌నాగ్ బెల్ట్‌లోని అహ్లాన్ గగర్‌మండు అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులను మట్టుబెట్టడానికి భారీ సెర్చింగ్ ఆపరేషన్ ప్రారంభించబడింది.

# భయానక విషయాలు

డాక్టర్లకు భద్రత లేకపోతే.. పై చదువుల కోసం ఆడపిల్లలను వారి తల్లిదండ్రులు బయటకు ఎలా పంపిస్తారు..? నిర్భయ కేసు తర్వాత కఠిన చట్టాలు వచ్చినప్పటికీ ఇలాంటి నేరాలను నిలువరించడంలో ఎందుకు విఫలం అవుతున్నాం. హాథ్రస్ నుంచి ఉన్నావ్, కథువా నుంచి కోల్‌కతా వరకు.. ఇలా వెలుగులోకి వస్తోన్న ఘటనలపై ప్రతిపార్టీ, సమాజం తీవ్ర చర్చ జరపాలి. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి' అని రాహుల్ పోస్టు పెట్టారు. బెంగాల్ హత్యాచార కేసులో బాధిత కుటుంబానికి ఎట్టిపరిస్థితుల్లోనూ న్యాయం జరగాలని, దోషులకు తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఘటనపై ఇప్పటికే కాంగ్రెస్ అగ్ర నాయకురాలు ప్రియాంకాగాంధీ స్పందించారు. ఇది హృదయవిదారక ఘటన అని వ్యాఖ్యానించిన ఆమె.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని తృణమూల్ ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ జూనియర్ వైద్యురాలు ఆసుపత్రిలో గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం ఆసుపత్రి సెమినార్ హాలులో అర్ధనగ్న స్థితిలో శవమై కనిపించారు. ఈ కేసులో పోలీసు వాలంటీర్ అయిన నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించగా.. పలు భయానక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ఆమె శరీరానికి అయిన గాయాలను చూస్తుంటే ఒక వ్యక్తి మాత్రమే దాడి చేసినట్లు కన్పించట్లేదు. మృతురాలి వ్యక్తిగత అవయవాల్లో 150 మిల్లీగ్రాములు వీర్యం ఉన్నట్లు పోస్ట్‌మార్టం నివేదికలో ఉంది. ఆ మోతాదు కేవలం ఒకే వ్యక్తికి సాధ్యం కాదు. ఇందులో ఎక్కువ మంది దారుణానికి పాల్పడి ఉండొచ్చు' అని అఖిల భారత ప్రభుత్వ వైద్యుల సమాఖ్య అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబర్ణ గోస్వామి అభిప్రాయపడ్డారు.

## గ్యాంగ్‌స్టర్ హత్య కేసును
# ఛేదించిన పోలీసులు

### 8 మంది నిందితుల అరెస్ట్
### రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి




రాచకొండ కమిషనరేట్, ఆగస్ట్14 **(క్విక్ టుడే న్యూస్):** బాలాపూర్‌లో జరిగిన గ్యాంగ్ స్టర్ రియాజ్ హత్య కేసును ఛేదించామని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. బుధవారం ఎల్బీ నగర్‌లోని రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీపీ సుధీర్ బాబు మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు హామిద్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ రియాజ్ హత్య కోసం రూ.13 లక్షల సుపారీ తీసుకున్నట్లు నిందితులు తమ విచారణలో వెల్లడించారన్నారు. అలాగే నిందితుల నుంచి కంట్రీ మేడ్ గన్, రెండు బు÷-లలెట్స్, రెండు గొడ్డళు ్లతోపాటు ఓ కత్తిని సైతం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మీర్‌పేటలో వాటర్ ట్యాంక్ నిర్మించిన స్థల వివాదం వీరి మధ్య ఘర్షణకు అసలు మూల కారణమని వివరించారు. అలా ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు, మృతుని మధ్య గొడవలు రోజురోజుకు పెరిగి పోయాయన్నారు. ఇక మృతుడు రౌడీ షీటర్ రియాజ్.. మీర్‌పేటలో భూ వివాదంపై ఒకరిపై ఒకరు కేసులు సైతం పెట్టుకున్నారని విషయాన్ని ఈ సందర్భంగా రాచకొండ సీపీ సుధీర్ బాబు గుర్తు చేశారు.ప్రధాన నిందితుడు హామిద్.. గోల్కొండకు చెందిన సలీంకి రూ.13 లక్షల సూపారీ ఇస్తానని చెప్పాడు. ఆ క్రమంలో అడ్వాన్స్‌గా రూ. 2.50 లక్షలు ఇచ్చాడన్నారు. ముందుగా హత్యకు పథక రచన చేసి హామిద్.. దుబాయ్ వెళ్ళి పోయాడన్నారు. అంతకుముందు సలీం, హామిద్ ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి.. కంట్రీ మేడ్ గన్ కొనుగోలు చేశారని చెప్పారు. ఆ తర్వాత మొయినాబాద్ వద్ద గొడ్డళ్ళు, కత్తులు కొనుగోలు చేశారని తెలిపారు.అనంతరం రియాజ్‌ను హత్య చేసేందుకు ముందే రెక్కీ సైతం నిర్వహించారు. అలా కంచన్‌బాగ్‌లోని ఓ వైన్స్ షాపులో రియాజ్ తాగి బైక్‌పై వస్తుండగా... అతడిని కార్‌తో డీకొట్టారని చెప్పారు. ఆ తర్వాత అతడు కింద పడగానే కళ్ళల్లో కారం చల్లి.. అతడిపై కత్తితో పాటు గొడ్డళ్ళతో దాడి చేశారని వివరించారు. అనంతరం గన్‌తో సలీం షూట్ చేశాడు. దీంతో రియాజ్ మరణించాడు. ఈ హత్య అనంతరం వారు విజయవాడకు చేరుకున్నారు. అక్కడ వారు కారును వదిలేసి వైజాగ్‌కి బస్‌లో వెళ్లారు. అక్కడి నుంచి ఒడిశా రాజధాని భువనేశ్వర్ చేరుకున్నారు. ఈ విషయాన్ని గమనించి.. వారిని వలపన్నీ భువనేశ్వర్లో అరెస్ట్ చేశామని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. ఈ కేసులో ం7గా ఉన్న నిందితుడు ఇనాయత్ ఈ మర్డర్ ఎ÷-లాన్‌కి డబ్బులు సమకూర్చినట్లు తమ విచారణలో తేలిందన్నారు. అయితే రియాజ్‌ను హత్య చేస్తే.. తాను డాన్ అవుతానని నిందితుడు హామిద్ భావించాడని సీపీ సుధీర్ బాబు వివరించారు.

మొదటి పేజీ తరువాయి..

## తెలంగాణే లక్ష్యం

రేవంత్ రెడ్డి గారు ప్రారంభించారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఉన్నతాధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కొత్త క్యాంపస్ ఏర్పాటుతో కాగ్నిజెంట్ సంస్థకు దేశంలోనే హైదరాబాద్ అతిపెద్ద కేంద్రంగా మారిందని, ప్రస్తుతం సుమారు 65వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని, తద్వారా తెలంగాణలో ఉద్యోగాలు కల్పించే రెండో అతిపెద్ద సంస్థగా కాగ్నిజెంట్ ఎదగడం గొప్ప విషయమని ముఖ్యమంత్రి అభినందించారు. దావోస్ పర్యటనలో అంగీకారం కుదిరితే, కేవలం ఆరు నెలల వ్యవధిలోనే కాగ్నిజెంట్ వారు హైదరాబాద్ లో నూతన క్యాంపస్ ఏర్పాటు చేయడం రికార్డు అని సీఎం అభినందించారు. శతాబ్దాల మనగడలో హైదరాబాద్ నేడు విశ్వనగరంగా ఎదిగిందని, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ గారి మద్దతుతో ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం నేదురుమల్లి గారు ఐటీ పార్క్‌కు శంకుస్థాపన చేసిన నేపథ్యమే హైదరాబాద్ ను ఐటీలో మేటిగా నిలబెట్టిందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోగానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాతగానీ పాలకులు హైదరాబాద్ విషయంలో రాజకీయ భేదాభిప్రాయాలను పక్కనపెట్టారని , ప్రస్తుత ప్రపంచ అవసరాల దృష్ట్యా తాము నిర్మిస్తోన్న ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళుతుందని సీఎం తెలిపారు. పెట్టుబడుల సాధన కోసం ఇటీవల చేపట్టిన అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలు విజయవంతం అయ్యాయని, ఒక్క అమెరికాలోనే సుమారు 31వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాబట్టగలిగామని, తద్వారా దాదాపు 30వేల ఉద్యోగాలు వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా పెట్టుబడులు, ఒప్పందాల ప్రక్రియ కొనసాగుతుందని సీఎం అన్నారు. తెలంగాణకు మొత్తం మూడు వలయాలు ఉంటాయని, కోర్ అర్బన్ హైదరాబాద్ మొదటి వలయమైతే, రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఉండే రెండోదైన సెమీ అర్బన్ వలయంలో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్, ఫ్యూచర్ సిటీ ఉంటాయని, ఇక మూడో వలయమైన రూరల్ తెలంగాణలోని గ్రామాలను ఆసియాలోనే ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## కేజ్రీవాల్‌కు మళ్లీ షాక్

సీబీఐ అరెస్ట్‌ని ఢిల్లీ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ మరో పిటిషన్ వేశారు. లిక్కర్ స్కామ్‌లో అవినీతి జరిగిందన్న సీబీఐ ఆరోపణల్ని వ్యతిరేకించారు. అయితే..ఈ పిటిషన్‌ల ఆధారంగా సుప్రీంకోర్టు అఃఎకి నోటీసులిచ్చింది. జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. 'ప్రస్తుతానికి బెయిల్ ఇవ్వలేం. నోటీసులు మాత్రమే ఇవ్వగలం' అని స్పష్టం చేసింది. లిక్కర్ స్కామ్ కేసులో ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకి ఇటీవలే బెయిల్ మంజూరు చేసింది సుప్రీంకోర్టు. ఆ తరవాత రెండు రోజులకే అరవింద్ కేజ్రీవాల్ ఈ పిటిషన్ వేశారు. సీబీఐ, ఈడీ విచారణను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ కావాలని కోరారు. అంతకు ముందు ఢిల్లీ హైకోర్టు ఇదే వ్యవహారంపై విచారణ జరిపింది.

## సుంకిశాల ఘటనపై చర్యలు

దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. జలమండలి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సుంకిశాల పంపుహౌస్ రక్షణగోడ కూలిపోవడంతో పాటు పంపుహౌస్ పూర్తిగా నీట మునగడంపై అంతర్గత విచారణ జరిగింది. ఆ నివేదికను విచారణ కమిటీ ప్రభుత్వానికి అందజేసింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేసింది.

## లైన్ క్లియర్

హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం సుప్రీం స్టే ఇచ్చింది. మరోవైపు కొత్త నియామకాలను చేపట్టకుండా ఆపాలన్న పిటిషనర్లు కోరికను సుప్రీం తిరస్కరించింది. గవర్నర్, ప్రభుత్వ హక్కులను హరించినట్లే అవుతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని వ్యాఖ్యానించింది. ఎమ్మెల్సీల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించిందంతో కొత్త వారికి లైన్ క్లియర్ అయ్యింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేస్తూ భారాస నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది. అనంతరం పిటిషన్‌పై విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

## పల్లెలు, పట్టణాల్లో కంపు

విడుదల చేశాం. నేడు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామపంచాయతీలకు ఇంకెప్పుడు ఇస్తారు..? ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారు.. 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లని అంచనా. వాటి పరిస్థితి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యం.. కాంగ్రెస్ పాలనలో.. ప్లలెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. ఇక పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రేటర్ తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. రాష్ట్ర బ్జడెట్ లో జీహెచ్ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా.. కాంగ్రెస్ చెప్పుకునే ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా.. అని కేటీఆర్ అడిగారు. ÷ఎన్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు.. కొత్త పనులకు ప్రణాళిక లేదు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మత్తులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా..? వర్షాకాలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రతినిత్యం అవస్థలు పడుతున్న ప్రజలకు ఏం సమాధానం చెబుతారు..? సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే.. ఇక ఇతర శాఖల దుస్థితి ఏమిటి..? అని కేటీఆర్ మండిపడ్డారు.

## కాంట్రాక్ట్ వెనక్కి

రూ.150.9 కోట్ల బిడ్డింగ్ ధర వేయగా.. ఆ మొత్తం ఎక్కువగా ఉందని భారతీయ రైల్వే గుర్తించింది. అందుకే బిడ్డింగ్ రేటును రూ.140 కోట్లకు తగ్గించాలని ఆల్‌స్టోమ్ ఇండియాను అధికారులు కోరారు. కానీ.. ఆల్‌స్టోమ్ ఇండియా రూ.140 కోట్లకు తగ్గడానికి నిరాకరించింది. చివరగా రూ.145 కోట్ల చొప్పున ఒప్పందం కుదుర్చుకోవాలని కంపెనీ భావించింది. రూ. 30 వేల కోట్ల టెండర్‌కు బిడ్లు వేయడానికి వచ్చిన కంపెనీల్లో ఆల్‌స్టోమ్ ఇండియా బిడ్ అత్యల్పం కావడం గమనార్హం. మొత్తం 100 రైళ్ల తయారీకి ఈ టెండర్ జరిగింది. ఇతర బిడ్డర్ స్టాడ్లర్ రైల్, హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్‌లతో కూడిన కన్సార్టియం ఒక్కో రైలు సెట్‌కు రూ.170 కోట్ల అత్యధిక బిడ్ వేశాయి. గతంలో 120 రైళ్లకు చేసుకున్న కాంట్రాక్ట్‌లో 200 వందే భారత్ రైళ్లకుగాను ఒక్కో ట్రైన్‌కు రూ.120 కోట్లకే బిడ్లు పూర్తయ్యాయి. భారతీయ రైల్వేలు 2019లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాయి. మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును న్యూఢిల్లీ-కాన్పూర్-అలహాబాద్-వారణాసి మార్గంలో ఫిబ్రవరి 15, 2019న నడిపారు.

## రాయల్టీ వాపస్ చేయాలి

కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉందని 1989లో సుప్రీంకోర్టు తీర్పు తేల్చింది. దీన్ని వ్యతిరేకిస్తూ కొన్ని రాష్ట్రాలు సర్వోన్నత న్యాయస్థానానికి వెళ్లాయి. ఆ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గనులు, ఖనిజాలపై రాయల్టీ విధించే అధికారం రాష్ట్రాలకే ఉందని, కేంద్రానికి ఆ హక్కు లేదని జులై 25న 8-1 మెజారిటీతో తీర్పు ఇచ్చింది. అయితే, ఈ తీర్పును 1989 నుంచి వర్తింపజేయాలని.. గనులు, ఖనిజాలపై అప్పటి నుంచి కేంద్రం నుంచి విధించిన రాయల్టీ సొమ్మును వాపస్ ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. దీన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. రాయల్టీ వాపస్ ఇస్తే ఒక్క ప్రభుత్వ రంగ కంపెనీలే రూ. 70,000 కోట్లు తిరిగి చెల్లించాల్సి వస్తుందని, అలా చేయడం ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)లకు తీరని దెబ్బ అవుతుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకు తెలిపారు. అంతేగాక.. ఖజానా ఖాళీ అయి, పౌరులపై అధిక ధరల భారం పడుతుందని వివరించారు. తీర్పును గత నెల 25వ తేదీ నుంచి వర్తింపజేయాలని కేంద్రం అభ్యర్థించింది.దీనిపై ఇటీవల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

## ఎర్రకోట సిద్ధం

పేర్కొంది. మరోవైపు ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఫోటోలు, వీడియోలు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. ఇక ఈ తనిఖీలతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. దీనిపై ముందుగా ఎలాంటి సమాచారం లేదని పోస్టులు పెడుతున్నారు. తాను కూడా ఈ రద్దీలో చిక్కుకు పోయినట్లు ఎడల్‌వీస్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా వెల్లడించారు. సిబ్బంది సహకారంతో సమయానికే విమానం ఎక్కినట్లు తెలిపారు. ప్రయాణికుల ఆందోళన వేళ.. ఢిల్లీ విమానాశ్రయం స్పందించింది. ఆగస్టు 15 వేళ అదనపు తనిఖీల వల్లే అధిక సమయం పడుతోందని తెలిపింది. ప్రయాణికుల బాధ అర్థమవుతోందని, అసౌకర్యానికి చింతిస్తున్నామని వెల్లడించింది.

# దత్తత పేరుతో మనవడిని అమ్మేసిన నాయనమ్మ

### తల్లి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

**ఖమ్మం, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** మనవడు, మనవరాల్లు అంటే అందరికీ మక్కువ ఎక్కువ. వారిని ఎంతో గారాబంగా చూసుకుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఓ నానమ్మ... మనవడు అన్న కనికరం లేకుండా అమ్మకానికి పెట్టేసింది. ఖమ్మం జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని రఘునాథ పాలెంలో సొంత మనవడినే అమ్మేసింది నాయనమ్మ. మనవడిని దత్తత పేరుతో హై డ్రామాకు తెరతీసింది. ఖమ్మంలో ఓ కార్పొరేటర్ భర్త సహకారంతో హైదారాబాద్‌వాసికి దాదాపు రూ. 5 లక్షలకు అమ్మకానికి పెట్టేసింది. ప్రేమ వివాహం చేసుకున్న కొడుకు సాయి 2023లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే అప్పటికే సాయికి ఓ కొడుకు ఉన్నాయి. కొడుకు చనిపోయినా మనవడు ఉన్నాడని మురిసిపోకుండా సదరు నాయనమ్మ వాడిని అమ్మేసింది. దత్తత తరువాత 5లక్షలకి చిన్నారిని అమ్మేసిందంటూ కోడలు స్వప్న పోలీసులను ఆశ్రయించింది. రఘునాథ పాలెంకి చెందిన పందుల సాయి ఖమ్మం నగరంలో నిజాంపేటకు చెందిన కొమ్మినబోయిన స్వప్న 2021 డిసెంబరులో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే బాబు పుట్టిన నెల రోజులకే 2023 లో సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో 42 వ డివిజన్ కార్పోరేటర్ భర్త శేషగిరితో కలిసి అత్త నాగమణి తన కోడలి వద్ద నుంచి బాబును పెంచుకుంటానని తీసుకెళ్లింది. 45 రోజులకే దత్తత పేరుతో బాబును అమ్మకానికి పెట్టింది. అయితే బాబు కోసం స్వప్న ఎంతాగానో తపించింది. తన బాబును తనకు ఇవ్వమంటూ కార్పొరేటర్ భర్త చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని స్వప్న ఆవేదన వ్యక్తం చేసింది. బాబును ఇవ్వమంటూ బెదరింపులకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నా కుమారుడిని నాకు ఇప్పించండి' అంటూ సీసీఎస్ పోలీసులను స్వప్న ఆశ్రయించింది. కేసు నమోదు చేసి సీసీఎస్ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తును ప్రారంభించారు.

# నాగోలు మెట్రోలో పార్కింగ్ దందా

### పెయిడ్ పార్కింగ్‌పై మండిపడ్డ వాహనదారులు

**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** మెట్రో స్టేషన్ల వద్ద కొన్ని చోట్ల ఉన్న ఉచిత వాహనాల పార్కింగ్ ను ఉన్నట్టుండి పెయిడ్ చేయడం వివాదానికి దారి తీసింది. గురువారం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో నిర్వాహకులు పెయిడ్ పార్కింగ్ అని చెప్పడంతో అది పెద్ద వివాదానికి దారి తీసింది. చాలా సేపు వాహనదారులకు నిర్వాహకులకు మధ్య ఘర్షణ చెలరేగింది. చాలా ఏళ్లుగా మెట్రో ప్రయాణికులు తమ వాహనాలను ఆ స్థలంలో ఫ్రీగా పార్కింగ్ చేసుకుంటున్నారు. కానీ, గురువారం నుంచి నిర్వాహకులు పెయిడ్ అని చెప్పడంతో వాహనదారుల నుంచి విపరీతమైన వ్యతిరేకత ఎదురైంది. పైగా ఒక ప్రత్యేకమైన యాప్ డౌన్ లోడ్ చేసుకొని, దాని ద్వారా చెల్లింపులు చేయాలని సూచించారు. ఒకేసారి టూ వీలర్ కు రూ.40 వరకూ వసూలు చేస్తున్నారు. అది కూడా 'పార్క్ హైదరాబాద్' అనే యాప్ నుంచి చేయాలని కండీషన్ పెట్టారు. ఆ యాప్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ కావడం లేదని వాహనదారులు చెబుతున్నారు. అసలే ఆఫీసులకు వెళ్లే తొందరలో ఉన్న వారిని ఈ పార్కింగ్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. నగదు చెల్లించి పార్కింగ్ చేసేందుకు కూడా నిర్వాహకులు అనుమతించకపోవడంతో చాలా మంది వాహనదారులు వారిపై తిరగబడాల్సి వచ్చింది. నిర్వాహకులు మాత్రం సదరు యాప్ డౌన్ లోడ్ చేసుకొని, అక్కడ ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి మాత్రమే పార్కింగ్ చేయాలని చెబుతున్నారు. నిన్నటి వరకూ ఇక్కడ ఎలాంటి పార్కింగ్ ఫీజును వసూలు చేయకుండా.. ఇప్పుడు ఉన్నట్టుండి ఇలా చేయడం పట్ల వాహనదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

# ఇంత బలహీన ప్రభుత్వాన్ని చూడలేదు

### ఎనిమిది నెలలకే చేతులెత్తేసిన కాంగ్రెస్

### విరుచుకుపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను పాలించిన కిరణ్ రెడ్డిదే బలహీన ప్రభుత్వం అనుకున్నాం.. కానీ ఇవాళ తెలంగాణ రాష్ట్రంలో అంతకు మించిన బాధ్యతరాహిత్య పాలన వచ్చిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శించారు. గడిచిన ఎనిమిది నెలల కాలంలో వీధుల్లో పిచ్చి కుక్కలు ప్రజల్ని కరుస్తుంటే, కనకపు సింహాసనాల మీద కూర్చున్నవేమో ఇచ్చిన హామీలు నెరవేర్చమని ప్రశ్నిస్తే ప్రతి పక్షాన్ని కరుసున్నాయి అంటూ జగదీశ్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్ నేతలకు హామీలు ఇచ్చుడు, ఒట్లు పెట్టుడు ఒడిసిపోయాయి. ఉన్నమాటంటే ఉలిక్కిపడుతున్నారు. కాంగ్రెస్ మంత్రులు భుజాలు తడుముకుని సమాధానాలు చెప్పలేక ఏడ్చే పరిస్థితి వచ్చింది. చివరి రోజుల్లో వస్తది అనుకున్నాం కానీ ప్రారంభంలోనే ఈ పరిస్థితి తలెత్తింది. ఒక పరిపాలకుడికి 9 నెలలు అనేది తక్కువ సమయం కాదు. పథకాల అమలుకు డెడ్‌లైన్లు పెట్టుకున్నారు.. కానీ డెడ్‌లైన్లు అయిపోయాయి.. పథకాలు అమలు కాలేదు. ఇప్పుడు మాట మార్చి మాట్లాడుతున్నారు. రుణమాఫీ విషయంలో రూ. 41 వేల కోట్లు అని చెప్పి, రూ. 39 వేల కోట్లకు తెచ్చారు. దాన్ని రూ. 36 వేల కోట్లు చేసి, ఆఖరికి రూ. 12 వేల కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు అని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. మీరు ఎన్ని స్టోరీలు రాసుకున్నా. రాయించుకున్నా ప్రజల జేబుల్లోకి పైసలు పోవడం లేదు. హరీశ్‌రావు ఏమన్నడని మంత్రి బాధపడాలి.. కుమిలిపోవాలి. సీతారామ ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేశాం. బటన్ నొక్కే అదృష్టం మీకొచ్చింది. మీరు అదృష్టవంతులు అని హరీశ్‌రావు చెప్పారు. బటన్ నొక్కేటప్పుడు ఇది కేసీఆర్ కష్టం అని చెప్పాలని ఒక మాట సూచించారు. దానికి ఉలిక్కిపడి అన్ని అనుమతులు మేమే తెచ్చాం అని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు. హరీశ్‌రావు మాటలు బాధ కలిగించాయన్నారు. అసలు హరీశ్‌రావు ఒక్క బూతు మాట కూడా మాట్లాడలేదు అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు.

# పింగళి చిరస్మరణీయుడు

### ఆయన జెండాను ఎగరేయడం గర్వకారణం: బాబు

**అమరావతి, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** తెలుగువాడు పింగళి వెంకయ్య రూపొందించిన మువ్వన్నెల జాతీయ జెండా ప్రతి ఇంటిపై ఎగరడం తెలుగు ప్రజలకు మరింత ప్రత్యేకం, గర్వకారణమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. 78 స్వాతంత్య దిన్సోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఎక్స్ వేదిక ద్వారా చంద్రబాబు స్పందించారు. మహోజ్వల చరిత్ర గల భారత దేశ సమగ్రత కాపాడడం అందరి కర్తవ్యం అని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వరుసగా మూడో సంవత్సరం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని జరుపుకుంటున్నామని వెల్లడించారు. ఇంటింటా జాతీయ జెండా అనే ఈ కార్యక్రమం విస్తృత కార్యక్రమంగా మారడం ఆనందకర విషయమని అన్నారు. ప్రతి ఇళ్లు, ప్రతి కార్యాలయం పై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాలని, జాతీయ జెండాను మీ సోషల్ మీడియా పేజీలలో ప్రొ÷ల్ పిక్ గా పెట్టుకోవాలని సూచించారు. దీని వల్ల మనలో జాతీయ భావాన్ని కల్పిస్తాయి. స్ఫూర్తిని నింపుతాయని సీఎం అన్నారు.

# వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తి: జెఇవో

**తిరుపతి, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం జరుగనున్న వరలక్ష్మీ వ్రతానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని జేఈవో వీరబ్రహ్మం చెప్పారు. బుధవారం తిరుచానూరులోని ఆస్థాన మండపంలో జేఈవో వరలక్ష్మీ వ్రతంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని విభాగాల సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో ఆస్థాన మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలన్నారు. ఉత్సవ శోభ ఉట్టిపడేలా ఆస్థానమండపం, ఆలయ పరిసరాల్లో శోభాయమానంగా రంగవల్లులు తీర్చిదిద్దాలన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సాయంత్రం 6 గంటలకు పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధులలో ఊరేగి భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో గంజాయిపై ఉక్కుపాదం

### తెలంగాణలో అవినీతి అధికారులపై ఎసిబి దాడులు

### వరుస దాడులతో లంచావతారుల్లో భయం



**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడా గంజాయి అన్న పదం వినిపించకుండా దాడులు సాగిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో గంజాయి, డ్రగ్స్‌పై దాడులు పెరిగాయి. కూపీ లాగుతూ భారీ మొత్తంలో గంజాయి పట్టుకుంటున్నారు. డ్రగ్స్ విక్రేతలను కూడా పట్టుకుంటున్నారు. ఇదే క్రమంలో ఎపిలో కూడా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో రవాణా చేయాలంటే భయడపేలా చేస్తున్నారు. అన్నింటిక ఇమించి తెలంగాణలో ఎసిబి అవినీతిపరుల భరతం పడుతోంది. లంచావతారులను టార్గెట్ చేస్తోంది. అన్ని శాఖలల్లో అవినీతిపరులపై ఏసీబీ దృష్టిసారించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 105 కేసులు నమోదు అయ్యాయి. వీటిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన కేసులే అధికంగా ఉన్నాయి. కోట్ల రూపాయల ఆస్తులు సంపాదిస్తున్న అధికారులపై అధికారులు నిఘా పెట్టారు. సోదాలు చేసి కేసులు నమోదు చేయడంతో పాటు అవినీతి సొమ్మును సీజ్ చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలో ఆరు కేసులను ఏసీబీ నమోదు చేసింది. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలో ఎక్కువ అవినీతి జరిగినట్లు గుర్తించారు. శివబాలకృష్ణతో మొదలయిన దాడులు రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ వరకు కొనసాగుతూనే ఉన్నాయి. దీనికితోడు ఏసీబీ నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరంటూ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు. రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ఎనిమిది లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అలాగే నిజామాబాద్ మున్సిపల్ సూపర్నెంట్ దాసరి నరేంద్రపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. నరేంద్ర ఇంట్లో రూ.2.93 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సంగారెడ్డి సీసీఎస్ పనిచేస్తున్న సీఐ వెంకట కిషోర్‌పై కూడా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.

నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి దొరికిపోయారు. లంచం డబ్బులు తీసుకోవాలంటూ జూనియర్ అధికారిని పురమాయించడం ద్వారా ఆ అధికారి అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తే.. ఏసీబీ అధికారులు అంతకుమించి చాకచక్యంగా వ్యవహరించి ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు భూపాల్‌రెడ్డితో పాటు కలెక్టరేట్ ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి చెందిన 14 గుంటల భూమి ధరణిలో నిషేధిత జాబితాలో ఉంది. దీన్ని ఆ జాబితా నుంచి తొలగించాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ముత్యంరెడ్డి వినతి పత్రం ఇచ్చాడు. పని అవ్వకపోవడంతో ముత్యంరెడ్డి ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డిని కలవగా ఆయన పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ. 8 లక్షలకు ఒప్పందం కుదిరింది. అయితే ఈ లంచం వ్యవహారం గురించి ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి మదన్ మోహన్‌ను ముత్యంరెడ్డి కలిసి ఆ డబ్బు ఇచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు.. మదన్ మోహన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మదన్‌మోహన్ వెంటనే భూపాల్‌రెడ్డికి తన ఫోన్ నుంచి కాల్ చేశారు. గుర్రంగూడ భూమికి సంబంధించిన విషయంలో డబ్బు చేతికి అందిందని చెప్పగానే ఆ డబ్బు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు రావాలని భూపాల్‌రెడ్డి సూచించారు. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మదన్‌మోహన్‌ను కారులో డబ్బుతో వెళ్లాలని ఆదేశించి.. ఆ వాహనాన్ని తమ కారులో అనుసరించారు. చెప్పిన చోటుకు వెళ్లి, అక్కడ రూ.8 లక్షలు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి మదన్‌మోహన్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అక్కడి నుంచి భూపాల్‌రెడ్డి, మదన్‌మోహన్‌ను అర్ధరాత్రి కలెక్టరేట్‌కు తరలించారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి తిమింగాలన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న సమాచారంతో నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాసరి నరేందర్ ఇంటితో పాటు ఆయన కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు.

# పలు దేశాల్లో ఆగస్ట్ 15ననే స్వాతంత్ర్య ఉత్సవాలు

### 14ననే పాక్ ఆవిర్భావం.. స్వాతంత్ర్య దినోత్సవం

### కొరియా దేశాల్లోనూ నేడే స్వాతంత్ర్య దినోత్సవం



**న్యూఢిల్లీ, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** భారతదేశం బానిసత్వం నుండి స్వేచ్ఛను సంపాదించుకున్న రోజూ ఆగస్టు 15. దేశం యావత్తు ఆగస్టు 15న దేశభక్తితో పులకరిస్తుంది. అదేరోజు దేశ విభజన కూడా జరిగింది. పాక్ పురుడు పోసుకుంది. 14ననే ఇష్టం వచ్చినట్లుగా గీసిన రేఖతో పాక్ ఏర్పడ్డది. అందులో భారత్‌లోని తూర్పు బెంగాల్ కూడా కలిసింది. తదనంతర పరిణామాల్‌ఓ తూర్పు బెంగాల్ కాస్తా బంగ్లాదేశ్‌గా అవతరించింది. అయితే భారతదేశం మాత్రమే కాదు.. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్యం పొందిన ఇతర దేశాలు కూడా ఉన్నాయి. ఈ దేశాలలో ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుగుతాయి. దక్షిణ కొరియా 1945, ఆగస్టు 15న జపనీస్ పాలన నుండి విముక్తి పొందింది. స్వాతంత్య దినోత్సవ వేడుకను అక్కడ గ్వాంగ్‌బోక్‌జియోల్ అని అంటారు. అంటే కొత్త వెలుగు పునరిద్ధరణ పొందిన రోజు అని అర్థమట. ఈ రోజున దక్షిణ కొరియాలో కూడా వేడుకలు, కవాతులు , సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. అంటే మనకన్నా రెండేళ్ల ముందే స్వాతంత్ర్యంపొందింది. ఉత్తర కొరియా కూడా జపాన్ ఆక్రమణ నుండి స్వతంత్యాన్ని ఆగస్టు 15నే పొందింది. అక్కడ స్వాతంత్య దినోత్సవ వేడుకను చోగుఖేబాంగ్'యిల్ అని పిలుస్తారు. వేడుకలు రాష్ట్రవ్యవస్థీకృతమైనవి. బహిరంగంగానే ఈవెంట్లు జరుగుతాయి. సైనిక కవాతులు, ప్రసంగాలు, దేశభక్తి కార్యక్రమాలు జరుగుతాయి. కొరియా కాస్తా ఉత్తర దక్షిణ కొరియాలుగా విడిపోయింది. రిపబ్లిక్ ఆఫ్ కాంగో ఆగస్టు 15, 1960 న ఫ్రాన్స్ నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం పొందింది. ఇది ఫ్రెంచ్ పాలనలో పడిపోయి సరిగ్గా 80 సంవత్సరాలు. 1969 నుండి 1992 వరకు దేశం మార్క్సిస్ట్ లెనినిస్ట్ రాజ్యంగా ఉంది. ఆ తరువాత బహుళ పార్టీ ఎన్నగల నిర్వహణకు మారింది. కవాతులు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రసంగాలతో వేడుకలు జరుగుతాయి. ఆగస్టు 15 లిచెన్ స్టెయిన్ స్వాతంత్య దినోత్సవం కాదు. కానీ ఆ దేశపు జాతీయ దినాన్న ఆగస్టు 15న జరుపుకుంటారు. చాలా దేశాలలో జరుపుకునే అజంప్షన్ అనే మతపరమైన పండుగ సందర్భంగా ఆగస్టు 15ను సెలవు దినంగా జరుపుకుంటారు. దేశ సార్వభౌమాధికారం, గుర్తింపు కోసం అక్కడి యువరాజు ఉత్సవాల రూపంలో ఆగస్టు 15ను వేడుకగా నిర్వహిస్తారు. ఆగస్టు 15, 1971 న యునైటెడ్ కింగ్డమ్ నుండి బహ్రెయిన్ స్వాతంత్యాన్ని పొందింది. 1931లో చమురును కనుగొని చమురు శుద్ధి కర్మాగారాన్ని స్థాపించిన మొదటి గల్ఫ్ దేశాలలో ఇది ఒకటి. అదే సంవత్సరం బ్రిటన్, ఒట్టోమన్ ప్రభుత్వాలు బహ్రెయిన్ స్వాతంత్యాన్ని గుర్తిస్తూ సంతకాలు చేసినా 1971 వరకు బ్రిటన్ పాలనలో కొనసాగింది.

# ఓబీసీ కన్వీనర్‌గా అవకాశం ఇస్తే దేశం మొత్తం తిరుగుతా

### మాజీ ఎంపి విహెచ్ వెల్లడి




**హైదరాబాద్, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** తనకు ఓబీసీ కన్వీనర్ గా అవకాశం ఇస్తే దేశం మొత్తం తిరుగుతా' అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ అన్యాయం జరిగినా తాను అక్కడి వెళ్లి న్యాయం కోసం పోరాడుతానన్నారు. 'నాకు రెండు సార్లు సీఎం అవకాశం వచ్చినా నేను తీసుకోలేదు..నాకు పదవులు ముఖ్యం కాదు.. పార్టీ కోసం పని చేస్తా' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని కావాలనేదే తన ఏకైక లక్ష్యమన్నారు. నిన్న ఏఐసీసీ మీటింగ్‌లో సోనియా గాంధీ , రాహుల్ గాంధీ, మల్లి కార్జున ఖర్గే లు కులగణన చేయాలని చెప్పారన్నారు. కులగణన జరిగితే సామాజిక న్యాయం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆలోచన అని చెప్పుకొచ్చారు. 1931 లో కులగణన జరిగిందని... మళ్ళీ ఇప్పటి వరకు జరగలేదన్నారు. బీజేపీ పార్టీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు కూడా కులగణన చేయాలంటున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో కులగణన బిల్ పెట్టారన్నారు. కులగణన కోసం రూ.150 కోట్ల బ్జడెట్‌ను కూడా కేటాయించారన్నారు. ఓబీసీ ఎంపీల కన్వీనర్‌గా కోట్లాడి ఐఐటీ, ఐఐఎమ్‌లలో రిజర్వేషన్‌ను తీసుకొచ్చానని తెలిపారు. ఇప్పుడు ఎంతో మందికి ఉద్యోగాలు వచ్చాయని హనుమంతరావు పేర్కొన్నారు.

# గురుకుల హాస్టళ్ల సమస్యలపై దృష్టి

### మంత్రి పొన్నం ప్రభాకర్

**సిద్ధిపేట, ఆగస్ట్14 (క్విక్ టుడే న్యూస్):** రాష్ట్రంలో గురుకుల హాస్టల్లలో సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లాలో హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ప్రతి జిల్లా కలెక్టరు, శాననసభ్యులు, విద్యశాఖ అధికారులు గురుకుల హాస్టళ్లను బాధ్యతగా సందర్శించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక నిధులతో ఎ÷-లాంటేషన్ పనులను పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందని.. త్వరలోనే విద్యార్థులకు శుభవార్త చెప్తామని తెలిపారు. విద్యారంగ సమస్యలకు 5,000 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. అసౌకర్యాలతో ఉన్న అన్ని విద్యాసంస్థలకు స్థలాల కేటాయింపు జరిపి పక్కా భవనల నిర్మాణం చేపడతామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 42 రైతు వేదికల ద్వారా యువ రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా... యువరైతులకు వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం తరపున అవసరమైన రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం యువరైతులకు వ్యవసాయ ఆధారిత పథకాలకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు తాను, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.




## డబుల్ ఇస్మార్ట్ కోసం రామ్ ఫీట్లు

థియేటర్లలో మాస్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేయాలంటే హీరో ఏదో ఒక రిస్క్ ఫీట్ చేయాల్సిందే. మూవీ లవర్స్ కోసం అలాంటి రిస్క్ చేసే యాక్టర్లలో ఒకడు రామ్ పోతినేని. పూరీజగన్నాథ్ దర్శకత్వంలో రామ్ నటించిన చిత్రం డబుల్ ఇస్మార్ట్ (ఆనీబీశ్శి÷ తాపజీసబి). బ్లాక్ బస్టర్ హిట్ ఇస్మార్ట్ శంకర్ సీక్వెల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ చిత్రంలో కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తోంది. డబుల్ ఇస్మార్ట్ ఆగస్టు 15న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా పూరీ టీం ఏదో ఒక అప్‌డేట్‌తో అభిమానులు, సినీ జనాల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. కాగా ఈ సినిమా కోసం బాలీ (ఇండోనేషియా)కి వెళ్లి తక్కువ టైంలో తప్పనిసరి పరిస్థితుల్లో 18 కిలోలు బరువు తగ్గానని చెప్పాడు రామ్. కాగా ఈ మూవీలో గన్స్, రౌడీలతో స్టైలిష్ యాక్షన్ పార్టు ఉండబోతున్నట్టు ఇప్పటివరకు వచ్చిన రషెస్ చెప్పకనే చెబుతున్నాయి. దీని కోసం రామ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. డబుల్ ఇస్మార్ట్ బీటీఎస్ స్టిల్స్ చూస్తే ఈ విషయం మీకే అర్థమవుతుంది. ఈ మూవీని నైజాంలో ప్రైమ్ షో ఫిలిమ్స్ విడుదల చేస్తుండగా.. తమిళనాడులో పాపులర్ ఫిలిం డిస్ట్రిబ్యూషన్ కంపెనీ శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేస్తోంది. ఇప్పటికే ధిమాక్కిరికిరి డబుల్ ఇస్మార్ట్ టీజర్, ట్రైలర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. పూరీ కనెక్ట్స్ బ్యానర్ తెరకెక్కిస్తోన్న ఈ మూవీ ఆడియో హక్కులను పాపులర్ మ్యూజిక్ లేబుల్ ఆదిత్య మ్యూజిక్ సొంతం చేసుకుంది.

### ఆదిపురుష్ ఫెయిల్ కావడంతో

## ఏడ్చేశాను : నటి కృతి సనన్

రెబల్ స్టార్ ప్రభాస్, బాలీవుడ్ నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో వచ్చిన చిత్రం ఆదిపురుష్ బాక్సాఫీస్ వద్ద అట్టర్‌ఫ్లాప్‌గా నిలిచింది. ఇక ప్రభాస్ రాధేశ్యామ్ తర్వాత మరో డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఈ సినిమా పరాజయంపై తాజాగా స్పందించింది నటి కృతి సనన్. ఆదిపురుష్ ఫ్లాప్ అయినప్పుడు నేను చాలా బాధపడ్డాను. మనం ప్రాణం పెట్టిన సినిమాలు పరాజయం అయితే తీవ్ర కుంగుబాటుకు లోనవుతాం. కొన్నిసార్లు ఏడ్చేస్తాం. అయితే ఈ తప్పు ఎక్కడ జరిగిందోనని ఆలోచిస్తాం. ఎదుటివారి విశ్వాసాలు, మనోభావాలను దెబ్బతీయడం అనేది మా లక్ష్యం కాదు. ప్రతి ప్రాజెక్ట్ వెనుక ఉద్దేశం పాజిటివ్‌గానే ఉంటుంది. అయితే అప్పుడప్పుడు అది కొందరికి నచ్చకపోవచ్చు. ఏది ఏమైనా ఈ అనుభవాల నుండి మనం చాలా నేర్చుకుంటాం. ఒక నటిగా నేను ఎప్పుడు పాజిటివ్‌గా ముందుకెళ్లాలి. తర్వాతి ప్రాజెక్ట్‌లపై దృష్టి పెట్టాలి. ఒక సినిమా హిట్ అవ్వడం అనేది చాలా అంశాల మీదా ఆధారపడి ఉంటుంది. అప్పటివరకు మన పనిని మనం 100 శాతం పూర్తి చేసుకుంటూ వెళ్లాలి అంటూ కృతి వెల్లడించింది.గతేడాది 'క్రూ', 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా' సినిమాలతో హిట్లు అందుకున్న ఈ భామ ప్రస్తుతం దోపట్టి అనే సినిమాలో నటిస్తుంది. బాలీవుడ్ నటి కాజోల్ దేవ్‌గణ్ నటిస్తున్న ఈ సినిమాకు శశాంక చతుర్వేది దర్శకత్వం వహిస్తున్నాడు.





## ఎన్టీఆర్‌కు గాయాలంటూ.. ప్రచారం

### క్షేమంగానే ఉన్నారంటూ స్పష్టీకరణ

ప్రముఖ హీరో ఎన్టీఆర్ కు తీవ్ర గాయాలయ్యాలంటూ బుధవారం ఉదయం వార్తలొచ్చాయి. దీనిపై నటుడి టీమ్ స్పందించి ఆ వార్తలను ఖండించింది. ఆయన సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. 'జిమ్ చేస్తుండగా ఎన్టీఆర్ ఎడమ చేతికి రెండు రోజుల క్రితం స్వల్ప గాయమైంది. అయినప్పటికీ ఆయన 'దేవర' షూటింగ్‌లో మంగళవారం పాల్గొన్నారు. ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఆయకు పెద్ద ప్రమాదం జరిగినట్టు వస్తున్న వార్తలు అవాస్తవం. దయచేసి ఆ ప్రచారాన్ని నమ్మకండి' అని విజ్ఞప్తి చేసింది. ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. ఈ సినిమా షూటింగ్‌లోనే ప్రమాదం చోటుచేసుకుందని, నటుడికి గాయాలయ్యాయని ప్రచారం జరుగుతోంది.



### స్నేహానికి ప్రాణమిచ్చే వ్యక్తి

## అల్లు అర్జున్

### ఆయ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో బన్నీ వాసు భావోద్వేగం

స్నేహితుడికి అవసరం ఉందంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా అల్లు అర్జున్ అండగా ఉంటారని నిర్మాత బన్నీ వాసు అన్నారు. 'ఆయ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. అల్లు అర్జున్‌తో తనకున్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'నాకు కష్టం వచ్చిందంటే ఇద్దరు వ్యక్తులు ఎప్పుడూ ముందుంటారు. వాళ్లలో ఒకరు మా అమ్మ అయితే.. రెండో వ్యక్తి నా స్నేహితుడు అల్లు అర్జున్. 'ఆయ్' సినిమా ప్రచారం సరిగ్గా జరగడంలేదని.. బన్నీని పోస్ట్ పెట్టమని అడగాలని మా టీమ్ వాళ్లు కోరారు. కానీ, నేను ఆయన్ను అడగలేదు. నేను సమాచారం ఇవ్వకుండానే ఆయనే తన ఎక్స్‌లో ఈ చిత్రం గురించి పోస్ట్ చేశారు. నాకు అవసరం ఉన్న ప్రతిసారి ఆయన ముందుండి నడిపిస్తారు. ఒక స్నేహితుడికి కష్టమొస్తే.. తనకు ఎలా సపోర్ట్ చేయాలని తెలిసిన ఏకైక వ్యక్తి నా దృష్టిలో అల్లు అర్జునే. 20 ఏళ్ల క్రితం నేను గీతా ఆర్ట్స్ నుంచి వెళ్లిపోవాల్సిన సంఘటన ఎదురైంది. ఆరోజు బన్నీ నాకు సపోర్ట్ చేయడం కోసం వాళ్ల నాన్నను కూడా ఎదిరించారు. అప్పుడు ఆయన సపోర్ట్ చేయకపోతే ఈరోజు నేను ఈ స్థానంలో ఉండేవాడిని కాదు. తన స్నేహితుల్లో ఎవరికి అవసరం వచ్చినా ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా బన్నీ సపోర్ట్ చేస్తాడు. మంచి వ్యక్తి' అంటూ తమ స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. 'సినిమాలకు సంబంధించిన విషయాలను సినిమా వరకు మాత్రమే ఆలోచించగల హీరో ఎన్టీఆర్. 'ఆయ్' ట్రైలర్‌ను పిఠాపురంలో చేయాలని నాకు అనిపించినప్పుడు ఎన్టీఆర్‌కు ఈ సమాచారాన్ని అందించాం. నిర్మాతకు ఉపయోగ పడుతుందంటే మిగతా విషయాలేవీ పట్టించుకోవద్దు అని చెప్పారు. ఈ విషయంలో ఆయనకు కృతజ్ఞతలు చెప్పాలి. నేను మొదటి నుంచి పవన్ కల్యాణ్ అభిమానిని. ఈరోజు ఆయనతో పాటు పొలిటికల్ జర్నీలో ఉంటున్నానంటే నా అదృష్టమని చెప్పాలి' అంటూ బన్నీ వాసు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ బావ మరిది నార్నే నితిన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'ఆయ్' ... మేం ఫ్రెండ్సండి అనేది ఉపశీర్షిక. నయన్ సారిక హీరోయిన్. అంజి కె.మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ప్రభాస్ సినిమాలో నేను లేను

### అభిమానులకు షాకిచ్చిన మృణాల్ ఠాకూర్

వరుస విజయాలతో జోష్ మీదున్నారు ప్రభాస్. ఆయన హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన 'సీతారామం' బ్యూటీ మృణాల్ నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వీటిపై ఆమె స్పందించారు. ప్రభాస్‌తో మృణాల్ ఉన్న ఫొటోను ఇన్‌స్టాలో ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'ఇది హను రాఘవపూడి చిత్రం ఫస్ట్‌లుక్' అని ఆ ఫొటోకు క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్‌పై మృణాల్ స్పందించారు. 'మీ ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పెడుతున్నందుకు క్షమించండి. నేను ఈ ప్రాజెక్ట్‌లో లేను' అని కామెంట్ చేశారు. దీంతో రూమర్‌కు చెక్ పడింది. మరి ఇందులో ప్రభాస్ సరసన ఎవరు కనిపిస్తారో అనే చర్చ మరోసారి మొదలైంది.



## యశ్ టాక్సిక్‌లో అక్షయ్ ఒబెరాయ్

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ 'టాక్సిక్' తెరకెక్కిస్తున్న సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ భాగమయ్యారు. ఈ విషయాన్ని తెలుపుతూ అక్షయ్ పోస్ట్ పెట్టారు. ఆయన్ని టీమ్‌లోకి ఆహ్వానిస్తూ మూవీ యూనిట్ పంపిన లెటర్‌ను షేర్ చేశారు. 'మీలాంటి ప్రతిభావంతులైన నటులతో కలిసి పనిచేసేందుకు 'టాక్సిక్' టీమ్ ఆసక్తిగా ఉంది' అంటూ అక్షయ్‌ను ప్రాజెక్ట్‌లోకి ఆహ్వానించింది మూవీ యూనిట్. ఈ చిత్రం ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు ఇందులోని నటీనటులు గురించి వెల్లడించలేదు. మొదటిసారి అక్షయ్ భాగమైనట్లు తెలుపుతూ పోస్ట్ చేయడంతో అభిమానులు సంబరపడుతున్నారు. ఈ ఏడాదిలో '÷టైర్'తో పలకరించిన అక్షయ్.. 'టాక్సిక్'తో కన్నడ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. యశ్ నటిస్తోన్న 19వ చిత్రమిది. ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్.. అన్నది ఉపశీర్షిక. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. 'కేజీఎఫ్' సిరీస్ విజయాల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



**Owner, Editor, Printed & Published:** Gillala Buchi Reddy 12-114/1/85, Krishna Sai Nagar, Peerzadiguda, Medipally Mandal, Medchal-Malkajgiri District - 500098. Telangana. Printed at S.A Printers, D-No. 3-92 Shed No 2, Sy No 45 & 49, Sadasiv Nagar, Narapally Village, Ghatkasar Mandal, Medchal-Malkajgiri District, Telangana, -500098. **RNI NO TELTEL/2023/86487**, Cell: 8125972476. website: quicktodaynews.com, e-mail: quicktodaynews@gmail.com